నడి రోడ్డుపై వాహనాల పార్కింగ్‌

- ప్రమాదాలకు అడ్డాగా గౌతమినగర్‌ చౌరస్తా
- 10 గ్రామాల ప్రజలకు తప్పని తిప్పలు
- పార్కింగ్‌ స్థలంలో హోర్డింగులు
- పట్టించుకోని అధికారులు


గౌతమినగర్‌లో రోడ్డుపై వాహనాలు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్‌ పరిధిలోని కూరగాయల మార్కెట్ల అభివృద్ధికి 2018 సంవత్సరంలో రూ.30లక్షల వ్యయంతో రామగుండం కార్పొరేషన్‌ 39వ డివిజన్‌ గౌతమినగర్‌లోని వారసంతను ఆధునికీకరించారు. ప్రతి బుధవారం నిర్వహించే గౌతమినగర్‌ కూరగాయల మార్కెట్‌ పది గ్రామాలకు ప్రధాన మార్కెట్‌. మార్కెట్‌ నిర్మాణ పనులు పూర్తయి నాలుగు సంవత్సరాలు గడిచినా.. వినియోగదారుల కోసం మార్కెట్‌ ప్రాంగణంలో పార్కింగ్‌ ఏర్పాటు చేయలేదు. మార్కెట్‌కు వచ్చిన వాహనదారులు నడి రోడ్డుపై వాహనాలను పార్క్‌ చేస్తున్నారు. దీంతో గౌతమినగర్‌ నుంచి ఫెర్టిలైజర్‌ సిటీ టౌన్‌షిప్‌ మీదుగా 10 గ్రామాలకు వెళ్లే ద్విచక్ర, ఇతర వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాయంత్రం సమయంలో వివిధ కాలనీలు, గ్రామాల నుంచి కూరగాయలు కొనేందుకు రావడంతో మార్కెట్‌ మొత్తం రద్దీగా ఉంటుంది. మార్కెట్‌ జరిగే సమయంలో రోడ్డుపై అడ్డంగా వాహనాలు పార్క్‌ చేసి ఉండడం, మార్కెట్‌కు దగ్గరలో వైన్స్‌ దుకాణం ఉండడంతో మద్యం మత్తులో మందుబాబులు రోడ్డుపైకి వచ్చి ప్రమాదాలకు కారణమవుతున్నారు. అధికారులు స్పందించి వారసంతలో ద్విచక్ర వాహనాలు పార్కింగ్‌ చేసేందుకు ఖాళీ స్థలం ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్‌ చేస్తున్నారు.

పార్కింగ్‌ స్థలం కబ్జా

గౌతమీనగర్‌ కూరగాయల మార్కెట్‌ పార్కింగ్‌ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టారు. గతంలో అక్రమ కట్టడాలను తొలగించిన కార్పొరేషన్‌ అధికారులు కూల్చిన భవనాల వ్యర్థాలను తొలగించలేదు. కార్పొరేషన్‌ అధికారులు స్పందించి మార్కెట్‌ స్థలంలో అక్రమంగా వెలిసిన దుకాణాలను తొలగించాలని స్థానికులు డిమాండ్‌ చేస్తున్నారు.

ట్రాఫిక్‌ నియంత్రించాలి

గౌతమినగర్‌ వారసంత ప్రతి బుధవారం నిర్వహిస్తారు. వారసంతలో సాయంత్రం ఆర్‌ఎఫ్‌సీఎల్‌ ఉద్యోగులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూరగాయలు కొనేందుకు రావడంతో.. సాయంత్రం సమయంలో ఎక్కువ రద్దీగా ఉంటుంది. వ్యాపారం జరిగే సమయంలో ద్విచక్ర వాహనదారులు వాహనాలను రోడ్డుపై అడ్డంగా పార్క్‌ చేయడంతో ప్రమాదాలకు నిలయంగా మారాయి. అధికారులు స్పందించి వారసంత జరిగే సమయంలో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు పోలీస్‌ సిబ్బందిని ఏర్పాటు చేయాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

హోర్డింగులను తొలగించాలి



మార్కెట్‌ ప్రాంగణంలో వాహనాల పార్కింగ్‌ కోసం ఏర్పాటు చేసిన స్థలంలో కబ్జాకు గురైన ప్రాంతాన్ని కార్పొరేషన్‌ అధికారులు గుర్తించి చర్యలు చేపట్టాలి. అధికారులు స్పందించి మార్కెట్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన హోర్డింగులను తొలగించాలి. ద్విచక్ర వాహనాలు పార్కింగ్‌ చేసేలా సౌకర్యం కల్పించాలి.

– నల్లాల ప్రణీత్‌, శాంతినగర్‌

తరచూ ప్రమాదాలు



రోడ్డుకడ్డంగా వాహనాలను పార్కింగ్‌ చేస్తున్నారు. దీంతో పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుపై వాహనాలు పార్కింగ్‌ చేసి ఉండడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి మార్కెట్‌ వ్యాపారం నిర్వహించే సమయంలో వాహనాలు రోడ్డుపై పార్క్‌ చేయకుండా చర్యలు తీసుకోవాలి.

– కల్వల సంతోష్‌, శాంతినగర్‌

గ్రంథాలయం సందర్శన

సాక్షి స్పందన


కాల్వశ్రీరాంపూర్‌లో గ్రంథాలయ భవనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కాల్వశ్రీరాంపూర్‌: శిథిలావస్థలో గ్రంథాలయం అనే శీర్షికతో ఈనెల 9న సాక్షి దిన పత్రికలో ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. మంగళవారం కాల్వశ్రీరాంపూర్‌లోని గ్రంథాలయ భవనాన్ని జిల్లా గ్రంథాలయ అధికారి ఏవీఎన్‌ రాజు పరిశీలించారు. గ్రంథాలయంలో సమస్యలను పాఠకులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న భవనం శిథిలావస్థకు చేరిందని, ఇరుకు గదిలో ఇబ్బందిగా ఉందని, ఉదయం 8 గంటల నుంచి 11 వరకు, సాయంత్రం 4 నుంచి 7 వరకు తెరిచి ఉంచాలని పాఠకులు వినతి ప్రతం అందించారు. పాఠకుల కోరిక మేరకు ఈనెల 12 నుంచి అమలు చేసేందుకు వెంటనే ఆదేశాలిచ్చారు. కాల్వశ్రీరాంపూర్‌లో నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.23లక్షలు మంజూరు చేసిందని, మరో రూ.6లక్షలు అదనంగా తన కోటా కింద అందించేందుకు కృషి చేస్తానని అన్నారు. గతంలో స్థానిక జెడ్పీ హైస్కూల్లో నూతన భవన నిర్మాణం చేపట్టేందుకు అనుమతి లభించిందని, పాఠకుల కోరిక మేరకు ప్రస్తుతం ఉన్నచోటే మరింత విశాలంగా భవన నిర్మాణానికి జిల్లా కలెక్టర్‌ దృష్టికి తీసుకుపోతానన్నారు. జిల్లాలోని గ్రంథాలయాల్లో లైబ్రేరియన్‌ పోస్టులు ఖాళీలున్నాయని, భర్తీ చేసేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోనున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగులు గఫార్‌, సంపత్‌, సదానందం పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలి


పెద్దాపూర్‌లో బడి బాట


సుల్తాన్‌పూర్‌లో గ్రామసభ

జూలపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో అర్హులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యను బోధిస్తున్నందున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఇన్‌చార్జి ఎంపీవో కవిత సూచించారు. పెద్దాపూర్‌, కాచాపూర్‌, తెలుకుంట, అబ్బాపూర్‌ గ్రామాల్లో బడి బాట ర్యాలీ నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు సర్కారు పాఠశాలలపై అవగాహన కల్పించారు. అనంతరెడ్డి, లచ్చయ్య, లక్ష్మణ్‌, అంగన్‌వాడీ కార్యకర్తలు సత్యవతి, రాజనర్సమ్మ తదితరులున్నారు.

ఎలిగేడు: మండలంలోని 12 గ్రామాల్లో బడిబాటపై మంగళవారం గ్రామసభలను నిర్వహించారు. బడీడు పిల్లలను గుర్తించడంతోపాటు బడి మానేసిన పిల్లలను బడిలో చేర్పించేలా ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేస్తున్నారు. ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎలిగేడు స్కూల్‌ కాంప్లెక్స్‌ హెచ్‌ఎం దేవేందర్‌రావు, సుల్తాన్‌పూర్‌, ధూళికట్ట జెడ్పీహెచ్‌ఎస్‌ హెచ్‌ఎంలు సదయ్య, నరేంద్రచారి, సీఆర్పీ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రామగిరి: బేగంపేట గ్రామంలో మంగళవారం అంగన్‌వాడీ ఆధ్వర్యంలో బడి బాట కార్యక్రమం నిర్వహించారు. తల్లులకు గుడ్లు, బాలామృతం పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు కొండ్ర సుమతి, రాచర్ల సరోజన పాల్గొన్నారు.

ఓదెల: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని ఓదెల ఎంఈవో ఆరెపల్లి రాజన్న కోరారు. మంగళవారం ఓదెల, కొమిర, నాంసానిపల్లె గ్రామాల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో అవగాహన సదస్సు నిర్వహించారు.

క్లుప్తంగా

చర్చలు సఫలం

- కుదిరిన వేతన ఒప్పందం


వేతన ఒప్పంద పత్రాన్ని చూపిస్తున్న రైస్‌ మిల్‌ ఆపరేటర్లు, తిరుపతిరెడ్డి

సుల్తానాబాద్‌: రైస్‌ మిల్లుల ఆపరేటర్లు, రైస్‌ మిల్‌ ఓనర్ల అసోసియేషన్‌ ఆధ్వర్యంలో జరిగిన చర్చలు సఫలం కావడంతో.. పలు రకాల వేతన ఒప్పందం కుదుర్చుకొని ఇరువర్గాలు మంగళవారం సంతకాలు చేశాయి. వేతనాల కోసం నెల రోజుల క్రితం నోటీసులు జారీ చేయగా.. యాజమాన్యం చర్చలకు ఆహ్వానించింది. మే 17 నుంచి 2026 మే 16 వరకు రెండేళ్ల ఒప్పందం అమల్లో ఉంటుందని వివరించారు. ఈ ఒప్పందం ప్రకారం ప్రస్తుతం ఉన్న వేతనంపై నెలకు రూ.2,500 ప్రతి ఆపరేటర్‌కు పెంచాలని, గతంలో ఉన్న బోనస్‌, పీఎఫ్‌, సర్వీస్‌ పే, దుస్తులు యథావిధిగా కొనసాగించాలని నిర్ణయించారు. రైస్‌ మిల్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు మోరపల్లి తిరుపతిరెడ్డి, అసోసియేషన్‌ అధ్యక్షుడు ఎర్రవెల్లి పురుషోత్తమరావు, కార్యదర్శి విజయ్‌పాల్‌రెడ్డి, కేశవరావు, రమేశ్‌, సత్తయ్య, అర్జున్‌రావు, గోపాల్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, ప్రసాద్‌, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు, యూనియన్‌ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, తాండ్ర అంజయ్య, నౌండ్ల బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్‌ సందర్భంగా జంతువులను బలివ్వం

సుల్తానాబాద్‌: ముస్లింల బక్రీద్‌ పండుగకు జంతువులను బలివ్వమని సుల్తానాబాద్‌ పట్టణ ముస్లిం యువకులు పోలీసులకు విన్నవించారు. ఈనెల 17న జరగబోయే బక్రీద్‌ పండగ సందర్భంగా ముస్లింలు కొన్ని జంతువులని ఖుర్బానీ(బలి) ఇస్తారని, ఖుర్బానీ ఇచ్చే జంతువుల్లో ఆవులను వధించొద్దని దేశవ్యాప్తంగా ముస్లిం మత పెద్దలు చెప్పారని అన్నారు. చట్టాలను గౌరవిస్తూ హిందూ ప్రజల మనోభావాలు దెబ్బతినొద్దనే ఉద్దేశంతో ఆవులను వధించొద్దని ముస్లిం పెద్దలు సూచించారని తెలిపారు. ఎవరైనా ఆవులను వధిస్తే చర్యలు తీసుకోవాలని సుల్తానాబాద్‌ ముస్లిం యువ నాయకులు సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై శ్రవణ్‌ కుమార్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. మహ్మద్‌ రఫీక్‌, మహ్మద్‌ అక్బర్‌, మహ్మద్‌ సాదిక్‌, మహ్మద్‌ మొయిజ్‌ ఉన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న సుచరిత

సుల్తానాబాద్‌రూరల్‌: కొదురుపాక గ్రామంలో మంగళవారం స్వశక్తి మహిళా సంఘాల మహిళలకు మహిళా సాధికారత సేవలపై మహిళా సాధికారత కేంద్రం జెండర్‌ స్పెషలిస్ట్‌ సుచరిత అవగాహన కల్పించారు. బాల్య వివాహాలను అరికట్టాలని, పోక్సో చట్టం, హెల్ప్‌లైన్‌, సఖీ కేంద్రం సేవలు, గృహ హింస చట్టాలతోపాటు వాటి సేవల గురించి వివరించారు. స్వశక్తి సంఘ మహిళలు స్రవంతి, శ్రీదేవి, శ్రావణి, లత తదితరులున్నారు.

లయన్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో అన్నదానం


ఆహారం వడ్డిస్తున్న సభ్యులు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్‌ 14వ డివిజన్‌ లక్ష్మీపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం గర్భిణులకు లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ రామగుండం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. లయన్స్‌ క్లబ్‌ నిర్వాహకులు, ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

'మిషన్‌ భగీరథ' నల్లాల పరిశీలన


నల్లా పరిశీలిస్తున్న ఎంపీడీవో లలిత

ముత్తారం: ఖమ్మంపల్లిలో మంగళవారం మిషన్‌ భగీరథ నల్లాల పనితీరును ఎంపీడీవో లలిత పరిశీలించారు. గ్రామంలోని అన్ని వాడలు తిరుగుతూ ఏమైనా లోపాలుంటే బాగు చేయించాలని స్థానిక పంచాయతీ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశారు. ఎంపీవో వేణుమాధవ్‌ ఉన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి 14 దాకా గడువు

పెద్దపల్లిరూరల్‌: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్‌ ఐటీఐల్లో ప్రవేశం పొందగోరే అభ్యర్థులు ఈనెల 14 లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్‌ నర్సింహాచారి తెలిపారు. రిజిస్ట్రేషన్‌ చేసుకున్న ప్రతి అభ్యర్థి ట్రేడ్లలో ఎక్కువ ఆప్షన్లను ఎంచుకోవాలని సూచించారు.

నియోజకవర్గానికి ఒక్కరే ఏవో

- సకాలంలో రైతులకందని సేవలు
- మండలానికో అధికారిని కేటాయించాలని విజ్ఞప్తి


కొప్పుల ప్రకాశ్‌, ఉమ్మడి మండల వ్యవసాయాధికారి

రామగుండం: నియోజకవర్గ పరిధిలో రామగుండం అర్బన్‌, అంతర్గాం, పాలకుర్తి మండలాలకు ఒకే ఒక్క వ్యవసాయాధికారి కొప్పుల ప్రకాశ్‌ను నియమించారు. కాగా సదరు అధికారి ప్రస్తుతం రామగుండం మండల వ్యవసాయాధికారిగా కొనసాగుతున్న క్రమంలో అదనంగా అంతర్గాం, పాలకుర్తి మండలాలకు సోమవారం నుంచి ఇన్‌చార్జిగా వ్యవహరించనున్నారు. అంతర్గాంలో ఉన్న ఏవో బూక్య రాంబాబు ఓదెల మండలానికి బదిలీపై వెళ్లారు. కాగా ప్రస్తుతం బదిలీపై వచ్చిన కొప్పుల ప్రకాశ్‌ రామగుండం అర్బన్‌ పరిధిలోని మేడిపల్లి, మల్కాపూర్‌, అల్లూరు, అబాది రామగుండం, పాములపేట, ఎల్కలపల్లి, గుంటూరుపల్లి తదితర గ్రామాలతో పాటు అదనంగా అంతర్గాం మండల పరిధిలో 16 గ్రామ పంచాయతీలు, పాలకుర్తి మండల పరిధిలో 16 గ్రామ పంచాయతీల్లోని రైతులకు అందుబాటులో ఉండడం కష్టంగా ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే రైతుబంధు, రైతు బీమా, రుణమాఫీ, అవగాహన సదస్సులు, అకాల వర్షాలతో నష్టపోయే పంటల వివరాలు, క్షేత్రస్థాయి సందర్శన తదితర అంశాలను నిర్వర్తించేందుకు సాధ్యం కాదని రైతులు పేర్కొంటున్నారు. దీనిపై జిల్లా అధికారులు స్పందించి మండలానికి ఒక వ్యవసాయాధికారిని నియమించాలని కోరుతున్నారు.

విద్యాసంవత్సరాన్ని విజయవంతం చేయండి

మంథని: నూతన విద్యాసంవత్సరం బుధవారం నుంచి ప్రారంభమవుతున్న క్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు విజయవంతం చేయాలని మండల విద్యాధికారి దాసరి లక్ష్మీ కోరారు. మండలంలోని పాఠశాలల్లో ఏకరూప దుస్తులు, ఉచిత పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలల్లో మౌలిక వసతుల పనులు వేసవిలో సెలవుల్లో వేగంగా జరిగాయన్నారు. బడి బాట ఈనెల 19 వరకు కొనసాగుతుందని తెలిపారు.

డబుల్‌ బెడ్‌ రూం ఇళ్లు కేటాయించండి


వినతి పత్రం అందజేస్తున్న లబ్ధిదారులు

రామగుండం: రామగుండం కార్పొరేషన్‌ పరిధిలో గతంలో డబుల్‌ బెడ్‌ రూం పథకానికి ఎంపిక చేసిన 660 మందికి సత్వరమే గృహాలను అప్పగించాలని కోరుతూ మంగళవారం లబ్ధిదారులు తహసీల్దార్‌ గెరివేణ కుమారస్వామికి వినతి పత్రం అందజేశారు. కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చి ఆరు మాసాలు గడుస్తున్నా.. గతంలో ఎంపిక చేసిన లబ్ధిదారులకు డబుల్‌ రూం గృహాలను అప్పగించడంలో జాప్యం చేస్తున్నారని పేర్కొంటూ పెద్దఎత్తున తహసీల్‌ కార్యాలయానికి తరలివచ్చారు. స్పందించిన తహసీల్దార్‌.. అసంపూర్తిగా ఉన్న అంతర్గత రహదారులు, డ్రైనేజీ, తాగునీటి వసతి, విద్యుత్‌ సరఫరా తదితర పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించేందుకు చర్యలు చేపడతామన్నారు. గతేడాది మార్చి 16న గోదావరిఖని జీఎం కాలనీలోని సింగరేణి ఆర్జీ–1 కమ్యూనిటీ హాల్‌లో జిల్లా కలెక్టర్‌, స్థానిక రెవెన్యూ అధికారుల సమక్షంలో డ్రా తీసి లబ్ధిదారులను ఎంపిక చేసిన విషయాన్ని లబ్ధిదారులు గుర్తు చేశారు.

హోటళ్లు, రెస్టారెంట్లలో కొనసాగుతున్న తనిఖీలు


తనిఖీ చేస్తున్న మున్సిపల్‌ సిబ్బంది

పెద్దపల్లిరూరల్‌: పెద్దపల్లి పట్టణంలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లలో మున్సిపల్‌ సిబ్బంది తనిఖీలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఫ్రిజ్‌లలో నిల్వ ఉన్న ఆహార పదార్థాలను గుర్తించి, సీజ్‌ చేశారు. వానాకాలం నేపథ్యంలో హోటళ్లలో పరిశుభ్రత పాటించడంతోపాటు నాణ్యమైన ఆహారం అందించేలా చూసేందుకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయితే, మున్సిపాలిటీలో తాత్కాలిక పద్ధతిలో పని చేస్తున్న సిబ్బందితో తనిఖీలు చేయించడం సరికాదని పలువురు నిర్వాహకులు అంటున్నారు. ఫుడ్‌ సేఫ్టీ అధికారి లేదా ఆహార నాణ్యతపై అవగాహన ఉన్న అధికారుల సమక్షంలో సంబంధిత పరికరాలతో తనిఖీలు చేయాలని కోరుతున్నారు. అవగాహన లేని సిబ్బంది తమకు తోచినట్లు వ్యవహరిస్తూ, జరిమానా విధించడం సరికాదని పేర్కొంటున్నారు.

చెరువు అభివృద్ధికి నిధులు

- ప్రభుత్వ విప్‌ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌


మ్యాదరికండి చెరువును పరిశీలిస్తున్న విప్‌ లక్ష్మణ్‌కుమార్‌

ధర్మారం: కొత్తపల్లి గ్రామ శివారులోని మ్యాదరికండి చెరువు అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తానని ప్రభుత్వ విప్‌ లక్ష్మణ్‌కుమార్‌ హామీ ఇచ్చారు. ఇరిగేషన్‌, రెవెన్యూ తదితర అధికారులతో కలిసి మంగళవారం ఆయన చెరువును పరిశీలించారు. గత ప్రభుత్వం చేసిన పనులపై ఆరా తీశారు. చెరువు అభివృద్ధికి గత ప్రభుత్వం రూ.16కోట్లు మంజూరు చేయగా, పాలకుల నిర్లక్ష్యంతో రూ.6కోట్లే ఖర్చుచేశారని ధ్వజమెత్తారు. చెరువు ఆయకట్టు దాదాపు 200 ఎకరాలు ఉందని, మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డితో మాట్లాడి గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో నిలిచిన అసంపూర్తి పనులను పూర్తిచేయిస్తామని అన్నారు. పత్తిపాక రిజర్వాయర్‌ నిర్మాణం కోసం సర్వే చేయిస్తానని పేర్కొన్నారు. దీనిద్వారా మ్యాదరికండి చెరువు నుంచి ఎండపల్లి, వెల్గటూర్‌ మండలాల్లోని ఆయకట్టుకు సాగునీరు అందుతుందని తెలిపారు. ధర్మపురి మండలంలోని రోళ్లవాగుకు కూడా త్వరలోనే మరమ్మతు చేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో జరిగిగన విద్యుత్‌, రెవెన్యూ, మిషన్‌ భగీరథ, పంచాయతీరాజ్‌ శాఖల అధికారులతో వివిధ సమస్యలపై సమీక్షించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ కొత్త నర్సింహులు, మాజీ వైస్‌ చైర్మన్‌లు కాడే సూర్యనారాయణ, పాలకుర్తి రాజేశంగౌడ్‌, దేవి జనార్దన్‌, ఎస్సార్‌ఎస్పీ ఈఈ ప్రసాద్‌, డీఈఈ కుమార్‌, మిషన్‌భగీరథ అధికారి శంకరయ్య, పంచాయితీరాజ్‌ డీఈఈ రాజ్‌కుమార్‌, ఏఈ రాజశేఖర్‌ పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలకు గాంధీ పార్క్‌ స్కూల్‌ విద్యార్థులు


టి.లిల్లీ


కె.రాహుల్‌

గోదావరిఖనిటౌన్‌: గోదావరిఖని గాంధీ పార్క్‌ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 6వతరగతి ప్రవేశ పరీక్ష ఫలితాల్లో అంతర్గాం మండలం లింగాపూర్‌ ఆదర్శ పాఠశాలలో 21 సీట్లు సాధించారు. వీరిలో టి.లిల్లీ 86, కె.రాహుల్‌ 84, టి.లాస్య 77 మార్కులు సాధించారు. విద్యార్థులను మండల విద్యాధికారి రాజయ్య, పాఠశాల హెచ్‌ఎం ఇబ్రాయిల్‌, చెరుకూరి స్వరూప్‌చంద్‌, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్‌ లక్ష్మి అభినందించారు.

ఉచిత శిక్షణతో నైపుణ్యం పెంచుకోవాలి

పెద్దపల్లిరూరల్‌: తెలంగాణ భవన నిర్మాణ కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఇస్తున్న ఉచిత ఉపాధి శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని నైపుణ్యాన్ని పెంచుకోవాలని ప్రాజెక్టు లీడర్‌ రాజేంద్ర అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో కార్మికుల పిల్లలకు ఉచితంగా కెరీర్‌ గైడెన్స్‌ రెస్యూమ్‌ తయారీపై వర్క్‌షాప్‌ నిర్వహించారు. కార్మిక శాఖ ఆధ్వర్యంలో 41 రకాల కంప్యూటర్‌ కోర్సులను యాప్‌ ద్వారా ఉచితంగా శిక్షణ అందించి స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తోందన్నారు. 238 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. ప్రకాశ్‌, వంశీ తదితరులున్నారు.

విద్యుత్‌ బిల్లులు ఆన్‌లైన్‌లో చెల్లించాలి

పెద్దపల్లిరూరల్‌: జిల్లాలోని విద్యుత్‌ వినియోగదారులు ఆన్‌లైన్‌ ద్వారా బిల్లులు చెల్లించొచ్చని ఎస్‌ఈ బొంకూరి సుదర్శన్‌ తెలిపారు. ఇప్పటికే ఆన్‌లైన్‌ విద్యుత్‌ బిల్లుల చెల్లింపు గణనీయంగా పెరిగిందన్నారు. మే నెలలో 54,360 మంది వినియోగదారులు రూ.8.05కోట్లు చెల్లించినట్లు పేర్కొన్నారు.

తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోండి

పెద్దపల్లిరూరల్‌: లక్ష్మీనగర్‌లో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్‌ మేనేజర్‌ శివప్రసాద్‌కు సమస్యను వివరించి పరిష్కారం చూపాలని కోరారు. లక్ష్మీనగర్‌లో వీలైనంత త్వరగా తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన తాత రవియాదవ్‌



కాల్వశ్రీరాంపూర్‌: పెగడపల్లికి చెందిన బీజేపీ ఓబీసీ రాష్ట్ర శాఖ కోశాధికారి తాత రవియాదవ్‌ కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆకాంక్షను, ఇక్కడి ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని బండిని కోరినట్లు రవియాదవ్‌ పేర్కొన్నారు.

మాదిగ శక్తి కార్యక్రమానికి రండి

పెద్దపల్లిరూరల్‌: ఈనెల 21న హైదరాబాద్‌లోని సోమాజీగూడ ప్రెస్‌ క్లబ్‌లో తలపెట్టిన మాదిగ శక్తి సుస్థిర లక్ష్యాల బ్రోచర్‌ ఆవిష్కరణ కార్యక్రమానికి రావాలని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, ప్రొఫెసర్‌ ఖాసీంలను ఆహ్వానించినట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు బొంకూరి సురేందర్‌ సన్నీ తెలిపారు.

బొగ్గుబాయి

పదోన్నతిపై వెళ్తున్న అధికారికి సన్మానం


ఎలీషాను సన్మానిస్తున్న అధికారులు, కార్మికులు

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–1 బెస్‌ వర్క్‌ షాప్‌ మేనేజర్‌గా విధులు నిర్వహించిన ఎలీషా ఎస్‌అండ్‌ఎండీగా పదోన్నతి పొంది బదిలీపై వెళ్తున్న సందర్భంగా సింగరేణి అధికారులు, కార్మికులు మంగళవారం ఘనంగా సన్మానించారు. పలువురు సింగరేణి అధికారులు ఎలీషా సింగరేణి సంస్థకు చేసిన సేవలను కొనియాడారు. బెస్‌ వర్క్‌ షాప్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రాజెక్ట్‌ ఇంజినీర్‌ శ్రీనివాస్‌, జేఈ రఘుకుమార్‌, హెచ్‌వోడీ సత్యనారాయణ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నాయకులు రమేశ్‌, శ్రీనివాస్‌, సుధాకర్‌, జక్కుల దామోదర్‌రావు, వెంకటేశ్వర్లు, రవీందర్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, ఆనంద్‌, రాంరెడ్డి, సిరాజుద్దీన్‌ పాల్గొన్నారు.

లయన్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో..

రామగిరి: ఆర్జీ–3 ఏరియాలో పలువురు అధికారులకు పదోన్నతులు రావడంతో మంగళవారం లయన్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. జీఎం కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అధికారి ఎలీషా పదోన్నతిపై కార్పొరేట్‌ స్టోర్‌ జీఎంగా బదిలీపై వెళ్తున్నారు. డీవైపీఎంగా విధులు నిర్వహిస్తున్న కావురి మారుతికి పర్సనల్‌ మేనేజర్‌గా పదోన్నతి రాగా.. సన్మానం చేశారు. లయన్స్‌ క్లబ్‌ అధ్యక్షుడు ముల్మూరి శ్రీనివాస్‌, డైరెక్టర్లు గంట వెంకటరమణారెడ్డి, గడ్డం శ్రావణ్‌కుమార్‌, టీవీ సురేష్‌బాబు, తీగల శ్రీధర్‌, సునీల్‌, సుధాకర్‌, రమ్యరెడ్డి, సుధ, సిబ్బంది పాల్గొన్నారు.

రక్షణ పరికరాలు పంపిణీ


రక్షణ పరికరాలను అందిస్తున్న తిరుపతి

రామగిరి: ఆర్జీ–3 ఏరియా ఓసీపీ–2లో విధులు నిర్వహిస్తున్న బెల్ట్‌ క్లీనింగ్‌ కార్మికులకు కాంట్రాక్టర్‌ డి.తిరుపతి రక్షణ పరికరాలను అందజేశారు. బెల్ట్‌ క్లీనింగ్‌లో పని చేస్తున్న కార్మికులకు రక్షణ పరికరాలను సమకూర్చాలని తెలపడంతో.. టోపీ, బూట్లు, చెమ్మస్‌లను కార్మికులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్‌ నాడెం శ్రీనివాస్‌, వేగోలపు సంతోష్‌, సెక్షన్‌ నాయకులు ఆర్‌.రాజేశం, పి.శ్రీనివాస్‌, పి.భూమయ్య, ఎ.రాజేశం, బి.కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

'పది' సప్లిమెంటరీ పరీక్షకు 21 మంది హాజరు

పెద్దపల్లిరూరల్‌: పదోతరగతి సప్లిమెంటరీ సాంఘిక శాస్త్ర పరీక్షకు మంగళవారం 21 మంది విద్యార్థులు హాజరయ్యారని డీఈవో మాధవి తెలిపారు. 39 మంది హాజరు కావాల్సి ఉండగా.. 21 మంది మాత్రమే పరీక్ష రాసినట్లు వివరించారు. ఉపాధ్యాయుల స్పెషల్‌ ఎడ్యుకేషన్‌ బీఈడీ అర్హత కలిగిన వారు తమ సర్వీస్‌బుక్‌, ఒరిజినల్‌ సర్టిఫికెట్లతో ఈనెల 12న జిల్లా విద్యాధికారి కార్యాలయానికి రావాలన్నారు. అక్కడ ధ్రువపత్రాలను పరిశీలిస్తారని వివరించారు.

ఎలిగేడులో ఎల్లమ్మ బోనాలు

ఎలిగేడు: మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి పట్నాల ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి బోనాలను వైభవంగా నిర్వహించారు. ఇంటికో బోనం చొప్పున మహిళలు తలపై బోనాలను ఎత్తుకొని ఆలయానికి తరలివెళ్లారు. బుధవారం ఎల్లమ్మ తల్లి పట్నం తదితర కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. సంఘం అధ్యక్షుడు అడ్డగుంట శ్రీనివాస్‌గౌడ్‌, ఉపాధ్యక్షుడు ఏగోలపు నాగరాజుగౌడ్‌, సభ్యులు రంగు శ్రీనివాస్‌గౌడ్‌, గుర్రం మల్లేశంగౌడ్‌, బుర్ర గణేశ్‌గౌడ్‌, అడ్డగుంట రాములు, బుర్ర వెంకటేశ్‌ తదితరులు పాల్గొన్నారు.